

# 6

**పి. సత్యవతి**

# మూడేళ్ళ ముచ్చట

## 2009 : ఒక వర్షాకాలపు ఉదయం

బిడ్డని చంకనేసుకుని ఏడ్చుకుంటూ అది వీధిలోపడి పరిగెత్తే దాకా అట్లా గోడకానుకుని నిలబడే వున్నాడు కోటేష్. అప్పుడు అతని బుర్రలో దీపం వెలిగింది. బయటికొచ్చి సైకిల్ తీశాడు. అదప్పటికే ఒక ఆటో తీసుకుని వెళ్ళిపోయిందని వీధి చివర కిళ్ళీకొట్టు వెంకటేసులు చెప్పాడు. "పుట్టింటికి చెక్కేసింది" అని కసిగా బూతులు తిట్టుకుంటూ సైకిల్ వెనక్కి తిప్పాడు. అప్పటికే అతని తల్లి మల్లీశ్వరి శోకాలు పెట్టి ఏడుస్తోంది. మొన్న రాత్రి పదకొండు గంటల మెగా సీరియల్లో కోడల్ని బాధపెట్టినందుకు అత్తగారింట్లో అందర్నీ పోలీసులు అరెస్టు చేసి అరేయ్ ఒసేయ్ అని తిట్టి బాగా కొట్టిన దృశ్యం గుర్తొచ్చి అది తనకే జరిగినట్లు ఊహించుకుని శోకాలు పెడుతోంది.

"ఏయ్ నోర్మూసుకో! ఎవళ్ళో పోయినట్లు ఏందా ఏడుపు" అని తిడుతున్నాడు తండ్రి. కోటేష్ విసురుగా వచ్చి మంచానికి అడ్డం పడ్డాడు. అతనికి ఏడుపొచ్చింది. ఈలోగా తండ్రి అవిణ్ని తిట్టడం ఆపి తనమీదకి వచ్చాడు. ఆయన ఏమంటున్నాడో వినిపించుకునే స్థితిలో లేడు. కాసేపు అట్లాగే పడుకుని ఒక్క ఉదుటున లేచి చెప్పులు తగిలించుకుని సైకిలెక్కాడు. తప్పు తనదేనేమో అనిపించింది. అందుకేనేమో ఏడుపొచ్చింది. ఆ ఇల్లు కాస్త దూరమే... అతను వెళ్ళేసరికి తాళంపెట్టి వుంది. పక్కవాళ్లని అడిగితే వాళ్లు ప్రపంచంలో వున్న అసహ్యాన్నంతా చూపుల్లో నింపుకుని "అంతా కలిసి ఇప్పుడే ఎటో పోయారు. ఆ పిల్ల ఎక్కొచ్చిన ఆటోలోనే... పోలీస్‌స్టేషన్ కనుకుంటా..." అన్నారు. అది చెప్పనే చెప్పింది. చెప్పినపని చెయ్యకపోతే అది భవానే కాదు. మళ్ళీ ఒకసారి బూతులు తిట్టుకుని ఇంటిదారి పట్టాడు. ఇహ పోలీసుల చుట్టూ తిరగాలి. పొద్దున లేచి ఎవరి మొహం చూశాడో గానీ....

**2006 : పరీక్షా ఫలితాలొచ్చిన ఉదయం**

"పొద్దున్నే దీని మొహం చూశానేమిటబ్బా" అనుకుంటూ పక్క మీదనించీ లేచాడు కోటేష్. అప్పుడే గుమ్మంలోకొస్తున్న జ్యోతిని చూసి. "ఎనిమిదైంది ఇంకా లెగవలేదేంటీ? జోతమ్మ ఇంటర్ ఫస్టు క్లాసులో ప్యాసైందబ్బాయా!!! వేం అప్పుడే గుడికి పోయొస్తున్నాం నువ్వీసారైన గట్టెక్కుతావా, లేదా?...' అన్నాడు ఇంటర్ ఫస్టుక్లాసులో ప్యాసైన జ్యోతమ్మ తండ్రి, తన మేనమామ.

"కంగ్రాట్స్! మరి? ఇంజనీరా? డాక్టరా?" అని వెటకరిస్తూ పళ్ళు తోముకోడానికి పెరట్లోకి పోయాడు.

"అయ్యన్నీ మనకెక్కడ కుదుర్తయ్‌రా.. బి.ఎస్సీలో చేర్పిస్తా గవర్మెంట్ కాలేజుందిగా! పైగా షిఫ్టు కాలేజి. సాయంత్రంపూట మేడమ్ దగ్గర పని కూడా చేసుకోవచ్చు" అన్నాడు మామయ్య.... ఆయన పనిచేసే కంపెనీ ప్రొప్రయిటర్ భార్యకి సాయంత్రం వేళ ఇంటి పనుల్లో సాయంచేసి తన ఖర్చులకి సంపాదించుకుంటుంది.

పళ్లు తోముకుంటూ అనుకున్నాడు, "అవున్లే దీని మొహానికి అంట్లు తోముకుంటే తప్ప గతి లేదు"

బయటికెళ్ళిన కొటేష్ తండ్రి కూడా వచ్చాడు. ఆయన జ్యోతి ప్యాసవడానికి సంతోషించడానికన్నా తన కొడుకింకా పదోక్లాసు దాటనందుకెక్కువ బాధపడ్డాడు..

"ఊళ్ళో ఇన్ని స్కూళ్ళుండగా ఎదవస్కూళ్ళో జేర్పించాడు ఎదవ స్కూలనీ!! ఛీ! ఛీ అదొక స్కూలూ, అదొక సదువూ. ఎప్పుడైనా అందులో కూసుని పాఠం విన్నదుందా?" ఖాండ్రించి ఉమ్మేస్తూ అనుకున్నాడు కోటేష్. జోతమ్మ, జోతమ్మ అయ్యా నిప్పు ముట్టించి పోయారు. కోటేష్ తల్లి నిప్పుతొక్కిన కోతిలా "డైలాగులు" మొదలెట్టింది. కోటేష్ జేబులు తడుముకుని పది రూపాయలు కనబడగా వీధి చివర ఇడ్లీ బండీ దగ్గరకు పరిగెత్తాడు. పళ్ళెత్తు నల్లకోతి పాసయిపోయి పీడ విరగడైంది. లేకపోతే దాన్ని చేసుకోమని అమ్మ చంపేసేది. అది డిగ్రీలో చేరినాక ఇక మామయ్య పది తప్పిన తన జోలికేం వస్తాడెహే!

కానీ వచ్చాడు. పది పాసుకాకపోతే ఎక్కడా ఎవడూ ఉద్యోగం ఇవ్వడనీ బండ సుబ్బయ్య అని ఒక మేస్త్రీ వున్నాడనీ ఆడి దగ్గరికి ప్రయివేటుకి పంపమనీ నాన్న దగ్గర కూచుని ఒకటే గోల పెట్టాడు. ఇంకా మామయ్యకి ఆశ చావలేదు. లేకపోతే ఆ కోతిని ఎవరు చేసుకుంటారరూ! తనకే అంటగట్టాలని ప్లానేస్తున్నాడు. చచ్చినా దాన్ని చేసుకోడు. సెల్ టవరెక్కి దూకనైనా దూకుతాడు గానీ!

"ఆయన ఫీజులు శానా ఎక్కువ బావా!" అని గుడ్లు తేలేశాడు నాన్న.

"ప్రయివేటు పొద్దునేగా బావా మధ్యాన్నం నించీ మన బ్రమ్మం మందుల కొట్టో పనికి పెడదాం నెలకో అయిదొందలిచ్చినా సరిపోతుంది ఫీజుకి... పైగా జులాయిగా తిరక్కుండా ఒక కాడ పడుంటాడు" అని "బోడి" సలహా కూడా ఇచ్చి తన "ఇలియానా" కూతురికి కొత్త బట్టలు కొనడానికి పోయాడు.

"ఈ బిళ్ల మీద పేరు చదువు" ఎర్ర తేలులాంటి కుంకంబొట్టు పంతులు ఒక మందు ఇచ్చాడు. అక్షరాలు ఎంత కూడబలుక్కున్నా అర్థం కాలేదు.

"ఇంగ్లీషు అక్షరాలు రావా?" అన్నాడు. అని తన వంక ఒక వంకర చూపు చూసి, "నన్నడక్కుండా ఎవరికీ ఏ మందూ ఇవ్వకు... పోనీ మందుల మీద రేట్లు చదివి కూడ్డం వచ్చా?" అన్నాడు.

ఈ పంతులు మహా "ఇంసల్టు చేస్తున్నాడు"... కోటేష్‌కి కోపం వచ్చింది. జన్మలో మొదటిసారి తమాయించుకున్నాడు. అన్నీ నేర్పండి సార్... నేర్చుకుంటా" అని వినయంగా చెప్పాడు. పంతులు గవర్మెంటుద్యోగం చేసి రిటైరయ్యాడంట. ఇప్పుడు ఈ కొట్టు మొత్తం ఆయనే బాధ్యెత తీసుకున్నాడు. బమ్మంగారు ఏరే ఏదో యాపారం చేసుకుంటారు. పంతులు శానా మంచోడు పాపం. పెళ్ళి కావల్సిన కూతురుందంట. ఇంజనీర్ చదువుతా వుందంట. మన నల్లకోతి కూడా ఇంజనీరవుద్ది. గామాల...హి హి హీ.

పంతులుకి అసలు కోపమే రాదు. అక్కడ ఎక్కువగా అమ్ముడయ్యే మందుల పేర్లన్నీ తెలుగులో రాసిచ్చాడు. కాల్కులేటర్ వాడ్డం నేర్పాడు. పదిహేను రోజులకి రెండొందలేభై రూపాయలిచ్చారు. అబ్బో! స్వంత డబ్బు! పది రూపాయలిమ్మంటే అమ్మకీ నాన్నకీ ఎంత కోపమో! ఈ డబ్బు తీసుకుపోయి బండ సుబ్బడి యెదాన కొట్టాలి కావోసు... సదువూ వద్దూ చట్టుబండలూ వద్దు... చచ్చినా ఇవ్వను ఎంజేసు కుంటాడో జేసుకోమను..."

డబ్బులొచ్చాడంగానే కోటేషుకు ఎక్కడలేని హుషారొచ్చింది. తనకీ మందుల కొట్టే రైటు.... కాస్త పంతులు మాట వింటే చాలు సొంతంగా డబ్బులొస్తై. ప్రయివేటూ లేదూ పదోక్లాసు పాసూ లేదు. ఇక్కడే సెటిలైపోదాం అనుకున్నాడు. ప్రయివేటు మానేసి ఫుల్ టైమ్ పనిచేస్తే ఎంతిస్తారో అడగాలి. అడిగేముందు కాస్త పంతుల్ని కాకా పట్టాలి.

"నాలుగు జొరమ్ టేబ్లెట్లివ్వండి పంతులుగారూ" గుప్పున సెంటువాసన తలతిప్పి చూశాడు. నీలంరంగు చుడీ పిల్ల. నీలంహాండ్‌బేగూ, మొహం మీద నీలంబొట్టు స్టిక్కరూ, కుడిచేతికి ఒక ఫ్యాన్సీ వాచీ!! ఇట్టా వచ్చి అడిగేవాళ్లకి ఏ మందులివ్వాలో నేర్పి పెట్టాడు పంతులు కోటేష్‌కి... నాలుగు టేబ్లెట్లక్కడ పెట్టి నీలం బొట్టు కేసి చూస్తూ నిలబడ్డాడు. అప్పుడా పిల్ల బేగులోనించీ సెల్‌ఫోన్ మోగుతున్నట్లు ఒక పాట పెద్దగా వినవచ్చింది. ఆ పిల్ల మందులు తీసుకుని డబ్బులివ్వకుండానే ఫోను తీసుకుని "సుందీ నువ్వా! ఎప్పుడొచ్చావే...' అని మొదలుపెట్టి బోలెడు సుత్తేసింది. తరవాత సాయంత్రం సినిమాకి పోదామంది. అట్లా మాట్లాడు కుంటూనే ఆ పిల్ల వెళ్లిపోతూంటే పంతులుగారు పిలిచి మందులిచ్చి డబ్బులడిగి తీసుకుని సెల్‌ఫోన్ కనిపెట్టిన వాణ్ణి తిట్టిన తిట్లు తిట్టకుండా తిట్టారు. ఈలోగా కోటేష్‌కి మతి పోయింది. ఏం స్టైలూ! ఏం స్టైలూ!! మన పళ్లకోతీ వుంది. మేడమ్ కూతురు వదిలేసిన చుడీలూ అదీనూ! ఈ పిల్ల తాలూకు వాళ్లకి జొరం తగ్గకపోతే బావుండును అనుకున్నాడు.

నాలుగు రోజుల తరవాతొక నాడు కొట్టు కట్టెయ్యబోతుండగా వచ్చి "రెండు తలనెప్పి టేబ్లెట్లివ్వండి' అంది మొహమంతా బాధగా పెట్టి. అప్పుడు ఎర్రటి లంగా ఓణీ వేసి రెండు చేతులకీ యాభై యాభై గాజులేసింది. మొహానికి పాములాంటి బొట్టు అతికించి దానిమీదొక మెరిసే రాయి అంటించింది.

"ఆ పిల్లని తొందరగా పంపించు కోటేషూ! మళ్ళీ ఫోనొస్తే ఈ రాత్రికి మనిద్దరం ఇక్కడే" అన్నాడు

పంతులు అలమార్లు తాళాలేస్తూ 'తలనొప్పి ఎక్కువగా వుందా?' కాని కాస్త ధైర్యం చేసి అడిగాడు "సుత్తి సినిమా ఒకటి చూసొచ్చాలే. అందుకు తగులుకుంది" అంది. అంటూ అతని మొహంలోకి చూసింది. నవ్వుతూ టాబ్లేట్టిచ్చాడు. "ఇవ్వేసుకుంటె తలనెప్పి దెబ్బకి తగ్గిపోద్ది" అని హామీ కూడా ఇచ్చాడు. ఈసారి ఫోన్ రాలేదు. ఆ పిల్లకి సినిమాకి వెళ్ళొచ్చినప్పుడల్లా తలనొప్పి మందేసుకోడం అలవాటు. వారానికి రెండు సినిమాలు చూడ్డం కూడా అలవాటే. మందులషాపు వీధిలోనే ఆ పిల్ల ఇల్లు... పొద్దున తొమ్మిదింటికే టిప్పు టాప్పుగా తయారై టిఫిన్ డబ్బా పట్టుకు పోవడం గమనించి ఆమె వెళ్ళే వేళకు కొట్టు బయట నిలబడ్డం మొదలుపెట్టాడు.

## 2006 చివర్లో ఒక అందమైన సాయంత్రం

అది భవానీద్వీపం... వీపుకి బోలెడు బరువున్న పుస్తకాల సంచీతో పదకొండు గంటలకల్లా వచ్చేసి బుద్ధిగా అయిదు గంటలకి కొంపచేరే లేలేత ప్రేమికుల కొక అందమైన రంగు రంగుల గొడుగు... కాలేజీనించో హైస్కూల్ నించో వచ్చి అది విడిచిపెట్టే వేళకి ఇల్లు చేరేదాకా ఆదరించి అలరించే ఆశ్రయం. అక్కడిదాకా పడవ ప్రయాణం. అందులో జ్ఞాపకం వచ్చే బోలెడు డ్యూయెట్ పాటలు, కబుర్లు... చేతిలో చెయ్యేసుకోడాలు "ఐ లవ్యూ" అనేసుకోడాలు. తన ప్రేమికురాల్ని ఏ ఇలియానాతోనో, అనుష్కాతోనో పోల్చుకునే ప్రియులు అట్లాగె మహేశ్‌బాబుతోనే వరుణ్ సందేశ్‌తోనో పోల్చుకునే ప్రియురాళ్ళు... అందమైన అబద్ధాలు...

"నువ్వేం చదువుకున్నావ్?" అంది అనూష్క (దుర్గాభవాని)

"బి.ఏ. చదువుతుండగా మా నాన్నకి యాపారంలో నష్టమొచ్చింది. చదువాపి మందులకొట్లో చేరా" అన్నాడు మహేష్ (కోటేశ్వరావు) ఉరఫ్ కోటేష్.

"నేనూ అంతే. ఇంటర్ ప్యాసుకాంగానే మా నాన్న పోయాడు. అన్న మమ్మల్ని సూడ్డంలా. అందుకే బ్యూటీపార్లర్‌లో ఉద్యోగానికి చేరా... నీకెంతిస్తారేమిటి? నేను మా మేడమ్ దగ్గర అన్నీ నేర్చేసుకున్నా.. తొరలోనే సొంత ప్రాక్టీస్ పెట్టుకుందామనుకుంటున్నా. అట్టా పెట్టుకుంటే నెలకి పదివేలొస్తై. మేడమ్ ఖాతాలన్నీ నేనే తీసేనుకుంటా... అవునూ నీవయసెంత?

"కాసేపాలోచించి "ఇరవై" అన్నాడు. నిజానికి పంథొమ్మిదేనని తెలుసు." నేనూ అదే అనుకుంటున్నా స్వంతంగా మందుల షాప్ పెట్టుకుందామని. మా మామయ్య తన కూతుర్ని చేసుకుంటే మందుల షాప్ పెట్టిస్తాడు. కానీ ఆ పళ్ళకోతినెవరు చేసుకుంటారు పగలు చూస్తే రేత్రి కలలో కొస్తుంది... కాలేజీలో చేరింది. సాయంత్రంపూట ఒకళ్ళింట్లో పనిచేస్తుంది. పాచిపని... హి హి హి...'"

నాకూ ఇరవైయ్యే అంతే.. నీ డేట్ ఆఫ్ బర్త్ ఏమిటి?"

జూన్ ఎనభై ఆరు... మరి నీదో? "నాది ఎనభై ఆరే. జనవరి రెండు. నీకన్న నేనే పెద్ద అనుకుంటా.. మరెట్లా?"

"ఏం ఫర్లా!! మహేష్‌బాబు కన్న ఆళ్ళావిడ అదే.. నమ్మరత... అయిదేళ్లు పెద్దదంట. మరి అభిషేక్ బచ్చన్ కన్న అయిస్వర్య కూడా పెద్దదేనంట."

"మా అన్న మంచోడు కాదు. నీకు తెలుసుగా రౌడి వీరబాబుతో స్నేహం...'

"ఏం ఫర్లా మాకూ రౌడీలు తెల్సు.."

"అయితే రేపాదివారం సాయంత్రం మా యింటికి రా... మా అన్నకి నిన్ను నా బాయ్‌ఫ్రెండ్‌గా ఇన్‌ట్రోడ్యూస్ చేస్తా.."

ఆ తరువాత వాళ్లిద్దరూ హిందీ సినిమాకి పోయారు. సినిమా మధ్యలో భవానీ అతనికి ఐస్‌క్రీమ్ ఇప్పించింది. ముద్దు పెట్టుకోనిచ్చింది. అతనికి "బయ్" చెప్పేటప్పుడు ఒక ఎగిరే ముద్దుని కూడా గాల్లోకి విసిరింది.

## 2007 వేసవిలో ఒక సాయంత్రం

"ఆడికి కాలేజీ స్పెల్లింగే రాదు. బి.ఏ. చదువుతూ మానేశాడంటే నువ్వెట్టా నమ్మి చచ్చావే?" అన్నాడు అన్నయ్య.

"ఇప్పుడేవనుకుని ఏం లాభం. జరగాల్సిందేమిటో చూడు... ఓ ఇరవై వేలున్నైగా మంచం, కంచం లాంటివేవో మనకి తగ్గట్టూ కొనిపెట్టి పంపించు. రేపు ఏకాదసి మంచిదంట. మనోళ్ళు నలుగుర్నీ పిలిచి వ్రతం చేసుకుని భోజనాలు పెడితే సరిపోతుంది. దీని పెళ్లి మనకిష్టమేనని లోకులనుకుంటారు..." అంది అమ్మ.

"ఆడి కులం అడిగితే ఏం జెప్పాల?" అన్నాడు అన్నయ్య.




"ఈ రోజుల్లో కులాలేందిరా? మన మందుల షాపు పంతులు కూతురు ముస్లిమాయన్ని చేసుకొచ్చింది. పంతులు పెద్ద పార్టీ ఇచ్చి ఉపన్యాసాలిచ్చాడు. ఆ మొహం మీద అంత కుంకంబొట్టాయన...పిల్ల ఇష్టపడిందని చెప్దాంలే.. కుర్రాడి బుర్రలో మట్టి వున్నా చూపులకి సుందరుడేగా... పైగా అందరం మాంసం తినేవాళ్లమే. ఇంకేంటి బాధ... దీని వేసాల్చూస్తోంటే ఇంటిమీదకి ఎప్పుడేం తెస్తుందోనని భయపడి చచ్చేదాన్ని.. పోన్లే నాన్నా! బుద్ధిగా గుళ్ళో పెళ్ళి చేసుకుని సరాసరి ఇంటికొచ్చింది... అయిదారు నెలలనించీ కుర్రాణ్ణి ఎరుగుదుం.. నెమ్మదిగానే కనపడుతున్నాడు" అంది అమ్మ.

అమ్మ చాలా మంచిది. ఆ మాటకొస్తే అన్నయ్యా మంచోడే... వదినా

మంచిదే.. ఏదో ఉత్తినే కోటేష్‌ని భయపెట్టడానికి అన్నయ్య మంచోడు కాదన్నది కానీ... తనిట్టా ఒక్క ఇరవై వేలతో అత్తారింటికి పోతే ఆళ్లకీ బోలెడు డబ్బు మిగులు... పాపం ఇన్నాళ్ళూ తను సంపాయించింది ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. అందుకే మేడమ్ ఇచ్చిన జీతం కస్టమర్లిచ్చిన టిప్పులూ తనే ఖర్చు పెట్టుకునేది, కానీ అన్నకే కోటేష్ అంటే ఇష్టం లేదు. కోటేష్ శానా శానా మంచోడు. ఒక్క గంట కూడా తనని విడిచి వుండలేదు. కోటేష్ తల్లే కాస్త ఏమిటోగా వుంది. ఇంకా నయం కోటేష్‌కి ఆవిడ పోలిక రాలేదు. ఎప్పుడూ అరవనైనా అరుస్తుంది. ఏడవనైనా ఏడుస్తుంది. తనెళ్ళాక అంతా "సెట్టయి"పోతుందిలే! తన అందచందాలు చూసి ఆళ్ళే అదిరిపోతారు. తనెళ్ళాక ఆవిడ నోరు మూయించేసి కోటేష్‌ని బి.ఏ. పూర్తి చేయించేసి, ఇంకాస్త మంచి ఉద్యోగం తెప్పించేసి, తనూ అతనూ కూడేసిన డబ్బుతో ఒక స్కూటరు కొనేనుకుంటే సినిమాలకెళ్ళినా హోటళ్ళకెళ్ళినా ఆటోలూ, బస్సులూ ఎక్కేపని తప్పిపోద్ది. తనూ కోటేష్ అట్లా స్కూటర్ మీద వెళ్ళి ఇంటికొచ్చాక దిష్టి తీయాలనైనా తెలుసో లేదో ఆ అయోమయం పెద్దమ్మ కోటేష్ తల్లికి.

**2008 ప్రారంభం :**

కోటేష్‌కి పరమ చిరాగ్గా వుంది. భవానీ పని మానేసిందగ్గర్నుంచీ సినిమాల్లేవు. ఐస్క్రీముల్లేవు. భవానీ ద్వీపాలూ లేవు. పైగా ఆ పిల్ల మందుల కింద తన జీతమంతా పోతోంది. కాపరానికి వచ్చిన నాలుగు నెలలకే వాంతులు. ఆపైన అది ఇదీ... ఆరు నెలలకే మేడమ్ భవానీని పనికి రావద్దు పొమ్మంది.

"సొంత ప్రాక్టీసు పెడతానంటివిగా..." అంటే ఇంతెత్తున ఎగిరింది. అసలు సంగతేమిటంటే ఆవిడ దీనికి ఏమీ నేర్పలేదు. కనుబొమ్మలు కత్తిరించడం తప్ప. మైనం ఉడకబెట్టడం తప్ప. ఆవిరి పట్టించడం తప్ప. జుత్తు కత్తిరించేటప్పుడు కత్తెరందివ్వడం తప్ప... మెడకు ఆప్రన్ చుట్టడం లాంటివి తప్ప.. పాదాలు రుద్దడం, గోరింటాకు పెట్టడం చూసి నేర్చుకుంది. అంతే... అని కోటేష్‌కి తెలిసిపోయింది. అక్కడికి ఖరీదైన క్లైంట్‌లు వచ్చేవాళ్లు. వాళ్ళు భవానీకి టిప్పులిచ్చేవాళ్ళు. ఎంతలేదన్నా నెలకి పన్నెండొందలొచ్చేవి. అంతా వాడేసుకునేది. ఎప్పుడన్నా వదినకి గాజులో పౌడరో తెచ్చేది. అమ్మకి మందులు తెచ్చేది. అప్పుడప్పుడూ ఉద్యోగం పోయాక చేతిలో పైస ఆడ్డం లేదు. ఆసరికే కోటేష్ టెంత్ నాలుగు సార్లు తప్పి వదిలేశాడని తెలిసిపోయింది. మందుల షాపు కాదు కదా, రోడ్డు మీద గొడుగు కింద కొట్టు పెట్టుకునే స్థోమతు కూడా లేదనీ తెలిసిపోయింది. పొట్ట ఎత్తైన తరువాత కాస్త వొళ్ళు కూడా వచ్చి డ్రెస్సులన్నీ బిగుతైపోయాయి. కొత్తవెవరు కుట్టిస్తారు? అమ్మ దయదలిచి రెండు లూజు నైటీలు కొనిచ్చింది. అత్తగారేమనుకుందో ఏమో బీసెంట్ రోడ్డుకు తీసుకుపోయి రెండు డ్రెస్సులు కొనిచ్చింది. వేసినవే వేసినవే వెయ్యాలంటే వాటిని చచ్చినట్టు ఉతుక్కోవాలి. ఇంటి దగ్గర అమ్మ ఉతికేది. ఇక్కడ ఈవిడెందుకు ఉతుకుతుంది? అసలే తనని చూసి ఏడుపు. కొడుకు ఆ నల్లపళ్ళకోతిని చేసుకోలేదని. ఇంత తొందరగా ఇట్టా ఉద్యోగం పోతుందని అనుకోలేదు. ఎట్టాగో ఈ గణ్ణం గడిస్తే మళ్ళీ పని అడగాలి మేడమ్‌ని... కోటేష్‌ని చూస్తే చిరాకేస్తుంది. మహా బద్ధకస్తుడు. అన్నకి మామూలు ఉద్యోగమే అయినా ఇల్లు పొందిగ్గా వుంటుంది. ఇంట్లో అన్నీ వున్నై. టీవీ, ఫ్రిజ్, కూలర్ లాంటివి. ఇక్కడేం లేవు. ఒట్టి జిడ్డు మనుషులు... ఛీ ఛీ... ఆషాఢమాసానికి అన్నయ్య సెల్లు కొనిచ్చేదాకా కోటేష్‌కి సెల్లు కూడా లేదు... ఏంటో భవానికంతా అయోమయంగా అయిపోయింది. ఇప్పుడు కోటేష్ వేరే మందులషాప్‌లో చేరాడు. పొద్దున పదినించీ రాత్రి పదిదాకా అక్కడే. జీతం రెండువేల అయిదొందలైంది. అందులో కొంత తల్లి లాక్కుంటుంది. "నిన్నూ, నీ పెళ్ళాన్నీ కూడా కూచోపెట్టి పెట్టడానికి నీ తాత ఇచ్చిన సొమ్మేం లేదిక్కడ" అని అరుస్తుంది. మామ ఏం పని చేస్తాడో గానీ పొద్దునపోయి రాత్రికొస్తాడు. అడవి గుంపు... తొందరగా అమ్మొచ్చి పురిటికి తీసుకుపోతే బాగుండు... తలనొప్పి బిళ్లలకి కూడా కోటేష్‌ని అడగాల్సిందే. ఓ పట్టాన తెచ్చివ్వడు. అట్లా మంచానికి అతుక్కుని తలుచుకుని తలుచుకుని ఏడవడం దినచర్య అయింది. పైగా మహంకాళమ్మ. అదే అత్తమ్మ. అరుపులొకటి. ఆవిడగారి మొగుడుగారి తిట్లు!! మన్ని కాదులే... ఆవిడనే.. ఇంట్లో వున్న కాసేపూ తిట్లూ అరుపులూ... నరకంలో వచ్చి పడ్డది. అయ్యో! భవానీ... చూస్తూ చూస్తూ గోతిలో పడ్డావు కదే!!

**2008 : చివర**

"అమ్మా! నేనిక్కడే వుంటాను. పాపని నువ్వు చూసుకో మళ్ళీ మేడమ్‌ని పని అడుగుతా..." అంది భవాని. తనని అత్తగారింటికి పంపే ఏర్పాట్లు గ్రహించి.

"అదేందమ్మా! నువ్వూ, నీ కోటేషూ ఒకర్నొకరు విడిచి ఒక్క రోజు కూడా ఉండలేరు గదా! ఇక్కడుంటానంటేవేంటీ" అంది వదిన.

"పాపని నీ అత్తగారు చూస్తుంది లేవే... నీ సంపాదన ఆళ్ళకి మటుకు సేదా ఏందీ?" అంది అమ్మ. భవానీ పురిటికెళ్లాక కోటేష్‌కి కాస్త ఊపిరాడినట్లయింది. స్నేహితులతో సినిమాలకి వెళ్లడానికి రెండు జతలు బట్టలు కుట్టించుకోటానికి కుదిరింది. ఇంటికొచ్చి బట్టలు మార్చుకోకుండానే మంచానికి అడ్డం పడ్డానికి వీలుగా వుంది. మళ్ళీ అదొస్తోందంటే కాస్త కష్టంగానే వుంది. అమ్మో! దానితో వేగడం చాలా కష్టం. గయ్యాళిది. ఎదురుతిరిగి ఎంతమాటంటే అంత మాటంటుంది. పైగా ఇప్పుడు పిల్లొకతి.. దాన్నీ దీన్నీ గూడా భరించాలి. దేవుడోయ్... దొరసాని ఫెళ్ళుమని దిగనే దిగింది... వచ్చినదగ్గర్నించీ దాని కోరికలకి అంతేలేదు. ప్రతిరోజు ఏదో ఒకటి తెమ్మంటుంది. ఒక్క క్షణం కూచోనివ్వదు. ఇప్పుడు భవానీ తన తల్లీ కూడా పోటీలు పడి అరుచుకుంటున్నారు. తిట్టుకుంటున్నారు. భవానీ తనని తిట్టినప్పుడల్లా అమ్మ "ఈ కుమ్మరాంని తెచ్చి మా నెత్తిన పెట్టావు... మీరు వేరే పోండి..నిన్నూ మీ ఆవిడని, నీ పిల్లనీ కూడా పోషించే శక్తి మాకు లేదు. నువ్విచ్చే బోడి వెయ్యి రూపాయలకి మిమ్మల్నందర్నీ ఈదడం మావల్ల కాదు.." అని అరుస్తోంది.

"మీది ఒట్టి దరిద్రపు కొంప.." అని భవాని ఏడుపు. కోటేష్‌కి ఇంటికి రాబుద్ధి కావడం లేదు. ఇరవై వేలతో వదిలించుకున్నారు.. కానీ కట్నం లేకుండా... దరిద్రం చుట్టుకుంది... ఛీ.. ఛీ...

"నీ ఈడువాళ్లంతా నిక్షేపంగా చదువుకుంటుంటే అప్పుడే నీకొక సంసారం. పిల్లా, జెల్లా..." నాన్న గోల.

**2009 జనవరి**

"ఈ నెలలో ఇది మూడోసారి నువ్విట్టా రావటం.. ఇదేం బాగాలేదురా.. నేనొచ్చి మీ అత్తగారితో మామగారితో మాట్లాడతా పద..." అన్నది అమ్మ.

"నన్ను నాలుగు రోజులుండనివ్వమ్మా... కాస్త ఊపిరి పీల్చుకుపోతానూ..." భవాని ఏడ్చింది.

"అదేందే ఆ చెంప అట్లా వుబ్బిందీ కొట్టారా ఏంది?"

"అత్తా మామా నన్నేం కొట్టరమ్మా ఈ సన్నాసోడే నా మీద ఒంటికాలిమీద లేస్తాడు. పిల్లకి పౌడర్ డబ్బా తెమ్మంటే... నేనూ ఊర్కోలేదులే తిరిగి కొట్టాను..." అమ్మా నన్నిక్కడుండనియ్యమ్మా... మళ్ళీ పనికెడతా... తలనొప్పి బిళ్ళ కొనడానికి కూడా రూపాయి వుండట్లేదు... అన్నిటికీ ఆణ్ణి దేవిరించాల్సొస్తంది. ఇదివరకల్లే ఖర్చుపెట్టన్లే... నాకూ పిల్లకీ కలిపి నీకు వెయ్యి రూపాయలిస్తా..." భోరుమని ఏడ్చింది భవాని. దీన్నిక్కడుంచితే వాడూ ఇక్కడే

తిప్పేస్తాడు. పిల్లని అత్తని చూడమను. ఆడబ్బేదో ఆళ్లకే ఇయ్యమను. చెబితే ఇనిందా? ఎర్రగా బుర్రగా ఉన్నాడని బుడింగిన పెళ్ళి చేసుకొచ్చింది....? అన్నాడు అన్నయ్య. నాలుగో రోజు తనంత తనె వెళ్ళిపోయింది భవాని.

"నువ్వు నీ పుట్టింటో వున్నా నాకేం బాధ లేదుగానీ నీ పిల్ల పెంపకం నావల్లగాదు... నీ డబ్బు లేకపోతే పీడా బాయె..." అంది అత్తగారు.

**2009 వర్షాకాలం మధ్యాహ్నం :**

"అణ్ని జైల్లో పెట్టొవద్దు ఏంవద్దు ఎస్సైగారూ. కొద్ది కోప్పడి బెదిరించి వదిలెయ్యండి కేసు రాయొద్దు... దీన్ని వాడు కొట్టడం ఇది మాకాడికి రావడం ఈ సమ్మత్సరంలో ఇదెన్నో సారో! అల్లుణ్ని జైల్లో పెట్టిస్తే మాకేం వొరుగుతుందండి... ఏదో కాస్త భయపెడితే చాలు ఒట్టి పిరికిసన్నాసి" అంది భవాని తల్లి.

"సరే నేజూసుకుంటా పోండి" అన్నాడు ఎస్సై గారు.

"అదేంది అట్టా జేశావు. జైల్లో ఎస్తే గాని ఆడికి బుద్ధిరాదు...." అంది కోపంగా భవాని ఇంటికొచ్చాక. తల్లికి తిక్కొచ్చింది. ఆవిడ భవాని. పుట్టుక దగ్గర్నించి మొదలుపెట్టి కొంత యాష్టపడి కొంత ఏడ్చి కొంత అరిచి "నీ చావు నువ్వు చావు. ఇక నావల్ల కాదు. కావాలని కట్టుకున్నావు ఇప్పుడు జైలంటావు... ఆడు జైల్లో వుంటే నువ్వేం జేస్తావు? నీ పిల్లకేమిటి గతి? తను దూర కంతలేదు మెడకో డోలని నీకో పిల్ల...? అనేసి గోడ వైపు తిరిగి పడుకుని పమిటకొంగు తడిసేలా ఏడ్చింది.... వదిన ఎంత బ్రతిమిలాడినా ఎవరూ అన్నం తిన్నారు కారు.

**మరునాడు సాయంత్రం :**

ఆసుపత్రి వరండాలో బెంచీమీద కూచుని వెక్కులు పెడుతున్న తల్లి... అక్కడె పచార్లు చేస్తున్న అన్న. కాస్త ఎడంగా కోటేష్. అతని తల్లీ తండ్రి. అప్పుడే అక్కడికి స్కూటర్ మీద తండ్రిని ఎక్కించుకొచ్చిన జ్యోతి... ఆమె కోటేష్ భుజం మీద చెయ్యి వేసి "ఎట్లా వుంది బావా?" అనడిగింది. అప్పుడావె ఎత్తువళ్ళ నల్లకోతిలా లేదు. నల్లకలువపువ్వులా వుంది. కోటేష్కి ఏడుపొచ్చింది బావురుమన్నాడు.

"ఒట్టి అఘాయిత్యం ముండ" అంది కోటేష్ తల్లి.

తన ముంగిట్లో కోడలి మృతదేహం. పోస్టుమార్టమ్. మీడియా వాళ్ళు... కట్నం కోసం వేధించారని వాళ్ళు చెప్పడం... పోలీసులు. ప్లీడర్లు జైళ్ళు.... పేపర్లో, టీవీలో "వివాహిత ఆత్మహత్య, వరకట్న వేధింపుల కారణంగా" అని రాయడం, కోటేష్ ఉద్యోగం పోవడం.

"ఆ దిగులుతో తండ్రి మంచాన పడ్డం, తను దిక్కులేనిది కావడం... మొదలైన దృశ్యాలన్నీ ఆవిడ కళ్ళముందు కదులుతున్నాయి.

"ఇంకెప్పుడూ దాన్ని కొట్టను అది బ్రతికితే" అన్నాడు కోటేష్. భవాని మంచిది పాపం నేనే విసిగించాను దాన్ని.

"దేవుడా! దాన్ని బతికించు... మమ్మల్ని అల్లరిపెట్టకు" అని దేవుడిని ప్రార్థించింది కోటేష్ తల్లి.

"దాన్ని నా దగ్గరే వుంచుకుంటాను. ఇంకెప్పుడూ దాని మీద యాష్టపడను. పిల్లని నేనే పెంచుతాను. దాన్ని పనికిపొమ్మంటాను. అది బ్రతికితే... అది బ్రతకాలి.." అని ఆసుపత్రిలో భవాని వున్న గది వైపుకి తిరిగి చేతులు జోడించింది ఆమె తల్లి.

"నేను కూడా దాన్ని పొమ్మనను. అది నా చెల్లి.. వాడొస్తే రానీ...తప్పేదేందీ. భవానీ నువ్వు బతకాలి. ఈ అన్నని క్షమించాలి" అన్నాడు అన్న.

"నేనెప్పుడూ ఆవేశపడను తొందరపడను. ఇప్పుడివన్నీ భవానికి వినబడే అవకాశం లేదు. బ్రతుకుతో పోరాడతాను...నాకింకా పాతికేళ్లయినా లేవు" అని భవాని కూడా గట్టిగా అనుకుందో లేదో మరి....

## ఒరవడి

డా|| శిలాలోలిత

ఒలుకుతున్న నీటిలా
రూపమూ దొరక్క స్థిరత్వమూ ఎరగక
బంధింపబడినా గాజుపాత్రలోకి ఇమిడి
అదేరూపంగా సమాధానపడుతుంది ఆమె.

ప్రాణజలం ఆమె
జీవజలం ఆమె
రంగూలేని ఏ హంగూలేని నిరాకారపు తనం
ఆకాశపురంగే తనదనుకునే నీటి ప్రతిఫలనం లాంటి ఆమె
చీకట్లో నీరు తన రూపాన్ని నల్లటి రంగుగా
మార్చుకున్నట్లు
ఆమె తన రూపాన్ని, అస్తిత్వాన్ని పదే పదే వెతుక్కుంటుంది.

నీటికీ, ఆమెకూ దగ్గరిపోలిక
నీటిచిత్రంలాంటి ఆమె నీటి మౌలిక లక్షణాన్ని
అలవరచుకుంటోంది. అందిపుచ్చుకుంటోంది.
గాజుపాత్రలు పగులుతున్న చప్పుడు
నీరు గలగలమని ఉరకలెత్తుతున్న ఉత్సాహం
ప్రవాహగుణం, పరుగులెత్తే స్వరం, ఇప్పుడు ఆమె.

పెళ్ళిమాత్రమే జీవితం కాదని, ఒక భాగం మాత్రమేనని
భర్త అడుగులకు మడుగులొత్తేతనమే సాంప్రదాయం అవదని
ప్రేమల నిర్వచనాల నిర్వేదాల్లో పడి
కొట్టుమిట్టాడే యాసిడ్ హింసల ప్రియురాలిగా మనలేనని
హింసకు ఎదురొడ్డే 'మానవి' నని నిల్చుంది ఆమె

ఆత్మగౌరవం ఆమె చిరునామా
ముళ్లకిరీటాల్ని మోస్తూ తిరుగాడే క్రీస్తుల్లా కాక
విశ్వాసాల వింజామరలై నడుస్తున్న - స్త్రీలు
అహంకారాల మూలాల్లోకి అడుగిడి
ప్రశ్నించి పరిశోధించే చైతన్యపు నజరానాలు - స్త్రీలు
పల్లేరు కాయల ప్రయాణంలో పడిలేస్తూ
గమ్యం నిర్దేశించుకున్న ధీరలు - స్త్రీలు
రాతినుంచి పరిమళాన్ని సృష్టించే స్థితప్రజ్ఞలు - స్త్రీలు

ఇప్పుడు నీళ్ళలా ఉరకలెత్తే ఉత్సాహంలాంటి
స్త్రీలనే మీరు చూస్తున్నారు
గొబ్బెమ్మల్లాకాక గొంతెత్తిన భూమికల్ని చూస్తున్నారు
పాత్రల్లోకి ఒంపి, ఆత్మల్ని చంపి అణచివేస్తే
ఇక కుదరదని, తలలెత్తి సగర్వంగా ప్రశ్నిస్తున్న
స్త్రీలనే మీరు చూస్తున్నారు.

ఆమె ఇప్పుడు ప్రవాహపు ఉరవడి
కొత్త చరిత్రకు ఆమె వేస్తున్న ప్రతి అడుగూ ఇకపై ఒక ఒరవడి.